



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆదివారం జరగనున్నాయి. మచిలీపట్నంలోని హిందూ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. కృష్ణాజిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండో బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు ఇవ్వనున్నారు.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



యువతకు దిశానిర్దేశం

ముగిసిన యువ కెరటాలు

యువతను చైతన్యపరుస్తూ ఉన్నత స్థాయికి ఎదిగేందుకు దిశానిర్దేశం చేసే లక్ష్యంతో మచిలీపట్నం హిందూ కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన యువకెరటాలు కార్యక్రమం శనివారం ముగిసింది. కొల్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు కొల్లు నీలిమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వేలాది యువతీ యువకులు పాల్గొని వివిధ అంశాల్లో తమ ప్రతిభను చాటారు. మచిలీపట్నానికి చెందిన ఐఏఎస్ అధికారిణి కొర్లపాటి హెప్సిబారాణి, నావెల్ కమాండర్ ప్రసాద్, ఎన్ఆర్ఐ రామకృష్ణ తమ ప్రసంగాలతో యువతకు దిశానిర్దేశం చేశారు. పట్టుదలతో కృషి చేస్తే విజయం వరిస్తుందన్నారు. వర్ధమాన సినీనటుడు కిరణ్ అబ్బవరం కళారంగం గురించి వివరించారు.


నటుడు కిరణ్ అబ్బవరం


నావెల్ కమాండర్ ప్రసాద్

నచ్చకుంటే 22ఏనే!

వైసీపీ పాలనలో వందలాది ఎకరాలు నిషేధిత జాబితాలోకి..

రైతులపై '22ఏ' అస్త్రం ప్రయోగించిన కొడాలి నాని

లింగవరం లేఅవుట్‌లో నిర్మాణాలు చేపట్టకుండా 22ఏ అస్త్రంతో కుట్ర

- గుడివాడ నియోజకవర్గంలో గడ్డం గ్యాంగ్ అరాచకాలు ఎన్నెన్నో..
- రెండేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- మాజీ మంత్రి నిర్వాకంపై సర్వత్రా విమర్శలు
- నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి
- కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులపైనే రైతుల ఆశలు

గత వైసీపీ ప్రభుత్వం గుడివాడ నియోజకవర్గం పరిధిలోని వందలాది ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి రైతులకు ఝలక్ ఇచ్చింది. మాజీ మంత్రి కొడాలి నాని మాట వినని, తనకు అనుకూలంగా లేని వారి భూములే లక్ష్యంగా 22ఏ అస్త్రాన్ని ప్రయోగించారు. అప్పటి జాయింట్ కలెక్టర్ సహకారంతో తమ భూములను నిషేధిత జాబితాలో చేర్చారని రైతులు ఆరోపిస్తున్నారు. 22ఏ జాబితా నుంచి తొలగించాలని గత రెండున్నరేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సుల్లో తమకు న్యాయం జరుగుతుందని కోటి ఆశలతో వేచిచూస్తున్నారు.


నిషేధిత భూముల జాబితాలో పెట్టిన గుడివాడ మండలం లింగవరం లేఅవుట్

ఆంధ్రజ్యోతి - గుడివాడ: గుడివాడ నియోజకవర్గంలోని రైతులపై మాజీ మంత్రి కొడాలి నాని కక్ష సాధింపు చర్యలకు దిగారు. తను చెప్పిన ప్రాజెక్టులకు భూములు ఇవ్వలేదని, తనకు అనుకూలంగా లేరని కొందరు రైతుల భూములను రెవెన్యూ అధికారులతో మాట్లాడి 22ఎ నిషేధిత జాబితాలో చేర్పించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయా బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాటి వైసీపీ పాలన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధిత జాబితాలో చేర్చిన భూములు ఇవే..

- గుడివాడ మండలం వలివర్తిపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 86లో సుమారు 400 మంది సన్న, చిన్నకారు రైతులకు చెందిన 445.75 ఎకరాల భూమిని ఎం.ఐ.జి(మిడిల్ ఇన్‌కామ్ గ్రూప్) ప్రాజెక్టు కోసం సేకరించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. తాము సూచించిన ధరకు భూములను అమ్మలేదనే అక్కసుతో ఆ నాటి మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని జిల్లా జాయింట్ కలెక్టర్ల సహకారంతో 445.75 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్పించారని సమాచారం. ఆ ప్రాజెక్టు కార్యరూపం దాల్చకపోవడంతో తమ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలని గత

మిగతా 4లో..

ఆ ముగ్గురే ఆదర్శం

లీ క్వాన్ యూ, వాజ్‌పేయి, చంద్రబాబు మార్గంలోనే వెళ్తా

- వారిలోని దూరదృష్టి, ప్రజాసేవ అంటే ఇష్టం
- ఫిట్‌నెస్ కన్నా సంకల్పం చాలా గొప్పది
- విద్యార్థులతో మాటామంతిలో మంత్రి లోకేశ్
- పాయకాపురంలోని జూనియర్ కాలేజీలో పర్యటన
- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

'జీవితంలో నేను ముగ్గురిని ఆదర్శంగా తీసుకుంటాను. వారి దూరదృష్టి, ప్రజాసేవ చేయాలన్న చిత్తశుద్ధి నన్ను ఎంతో ఆకర్షిస్తాయి. ఆ ముగ్గురూ.. సింగ్‌పూర్ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ, భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, మరొకరు మన సీఎం చంద్రబాబు' అంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలు విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చిన ఆయన విద్యార్థులకు భవిష్యత్తు గురించి దిశానిర్దేశం చేశారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని చిన్ని

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : 'నడవడానికి ఫిట్‌నెస్ కంటే సంకల్పం కావాలి. సంకల్పం అనేది అన్నిటికన్నా గొప్పది.' అని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. నగరంలోని పాయకాపురంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి మాట్లాడుతూ.. 'మేము ఒకటి, రెండు రోజులు ఆటలు ఆడితే తీవ్రమైన అలసటకు గురవుతున్నాం. మీరు అన్ని రోజుల పాటు అన్ని వేల కిలోమీటర్లు యువగళం పాదయాత్రలో ఎలా నడవగలిగారు.' అని ప్రశ్నించగా లోకేశ్ పైవిధంగా సమాధానమిచ్చారు.

20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా సీఎం : ఎంపీ కేశినేని

ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుకున్న యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో చాలావరకు పేద, బడుగు, బలహీన వర్గాలవారు ఉన్నారని,


విద్యావ్యవస్థలో మార్పులు : మంత్రి సత్యకుమార్ యాదవ్

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యపై కొందరిలో చిన్నచూపు ఉందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు అబ్బదనే అపనమ్మకం ఉందని, విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపేందుకు లోకేశ్ అద్భుతంగా కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 34 లక్షల మంది విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై కూడా ఆయన దృష్టి పెట్టారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు.

అటువంటి విద్యార్థులకు డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు చేతులమీదుగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారని, ఇప్పుడు మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ప్రభుత్వ కళాశాలల్లో

మిగతా 4లో...













మూడోరోజు పుస్తక ప్రదర్శనకు పోటెత్తిన పుస్తకప్రియులు



'మన సినిమా ఫస్ట్ రీల్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, రచయిత రెంటాల జయదేవ్ తదితరులు



మానవాళికి మహోదయం-అంతం కాదిది ఆరంభం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్.వెంకట్రావు, సాంబశివరావు, పాపారావు

సినిమా రంగానికీ సామాజిక బాధ్యత ఉండాలి

అది మర్చిపోయి, ధనార్జనే ధ్యేయంగా మారడం దురదృష్టకరం ● 'మన సినిమా ఫస్ట్ రీల్' పుస్తకావిష్కరణలో దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ

విజయవాడ కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా సినిమా రంగానికీ సామాజిక బాధ్యత ఉందని ప్రముఖ సినిమా దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో మూడో రోజు శనివారం రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన రెండో కార్యక్రమంలో ఎమ్మెస్కో పబ్లిషర్స్ వారి 'మన సినిమా ఫస్ట్ రీల్' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడారు. చరిత్రను, బాధ్యతను మర్చిపోయిన తెలుగు సినిమా రంగం కేవలం ధనార్జనే ధ్యేయంగా మారిపోవడం దురదృష్టకరమన్నారు. సామాజిక సమస్యలపై నాటి సినిమాల్లో పాటలు ప్రజలను ఆలోచింపజేశాయన్నారు.

ఊ అంటావా మావా..ఊహూ అంటావా లాంటి పాటలొస్తున్నాయి

ఇప్పటి సినిమాల్లో ఊ అంటావా మామా ఊహూ అంటావా లాంటి పాటలు వస్తున్నాయని తెలుగు సినిమా పాట ఎటు వెళ్లిపోతుందోనని తమ్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్ల సినీ రంగంలో ఉన్నా తనకే తెలియని విశేషాలు ఈ పుస్తకంలో రచయిత రెంటాల జయదేవ్ పొందుపరిచారన్నారు. మనందరి మనసులకూ దగ్గరైన కళారూపం సినిమా అని జస్టిస్ కృష్ణమోహన్ అన్నారు. ఎమ్మెస్కో ప్రచురణకర్త విజయకుమార్, పూర్ణపిక్చర్స్ అధినేత విశ్వనాథమ్ నవరంగ్ థియేటర్ అధినేత భూపాల్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అమెరికా ప్రపంచాధిపత్యానికి రోజులు చెల్లాయ్

అమెరికా ప్రపంచాధిపత్యానికి రోజులు చెల్లిపోయాయని, ఆర్థిక, సామాజిక రంగాల్లో ప్రపంచానికి అగ్రరాజ్యంగా ఉండే రోజులు అంతమయ్యాయని బండ్ల సాంబశివరావు అన్నారు. రామోజీరావు సాహిత్యవేదికపై సాహితీమిత్రులు ప్రచురించిన డి.పాపారావు రచించిన మానవాళికి మహోదయం-అంతం కాదిది ఆరంభం పుస్తకాన్ని ఆయన పరిచయం చేశారు. పాత్రికేయుడు ఎస్.వెంకట్రావు ఆవిష్కరించారు.

కార్టూనిస్టు భువన్ మృతికి సంతాపం



భువన్ మృతికి సంతాపం తెలుపుతున్న కార్టూనిస్టులు

సుప్రసిద్ధ రచయిత, కార్టూనిస్టు భువన్(ఎం.వి.జె.భువనేశ్వరరావు) మరణవార్త విని కార్టూనిస్టు మిత్రులు ధీవీవ పుస్తక మహోత్సవం బాలల వేదికపై సంతాపాన్ని తెలిపారు. రచయితగా, కార్టూనిస్టుగా, కాలమిస్టుగా సాహిత్యరంగంలో కృషి చేస్తున్న భువన్ వృత్తిరీత్యా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో మేనేజర్ హోదాలో సేవలందిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. భువన్ కథలు, కార్టూన్లు అన్ని తెలుగు పత్రికల్లో అచ్చయ్యాయి. ఆయన కథల పుస్తకం ఇటీవలే కన్నడంలోకి అనువదించారు. తండ్రి పేరుతో కథలు, కార్టూన్లపోటీ ప్రతిఏటా నిర్వహిస్తూ ఎంతోమందిని ప్రోత్సహిస్తున్నారు. కార్టూనిస్టులు కలిమిశ్రీ, బాచి, రావెళ్ల, కళాసాగర్, నాగిశెట్టి, పద్మదాసు, వేణుగోపాల్ తదితరులు భువన్ సేవల్ని, జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుని సంతాపాన్ని తెలిపారు.

మహాప్రస్థానం బతికే ఉంటుంది

సమాజంలో అసమానతలు, సంఘర్షణ ఉన్నంతకాలం శ్రీశ్రీ రచించిన మహాకావ్యం మహాప్రస్థానం జీవించి ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. మహాప్రస్థానం ప్రచురితమై 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పుస్తక మహోత్సవంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడారు. సమాజంలో శోషణ, వివక్షను ప్రశ్నిస్తూ, సమానత్వం కోసం శ్రీశ్రీ రాసిన ప్రతి పంక్తి యుగాలను దాటిపోతుందన్నారు. ఆయన కవిత్వంలో నిరీక్షణకు నిదర్శనంగా నిలిచే సందేశం ఎప్పటికీ యువతరాన్ని ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు . రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ ఆధునిక కవులెవరూ శ్రీశ్రీలా పదసంపదను సాధించలేకపోయారన్నారు. మంచి మనసుకి కాలం చెడ్డది కాదు వంటి పంక్తులు చదివినప్పుడల్లా మనస్సుకు కొత్త ప్రేరణ ఇస్తాయని ప్రశంసించారు. వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ మహాప్రస్థానం సమాజ మార్పు కోసం చేసిన పిలుపన్నారు. కేవలం కవిత్వంగా కాకుండా ప్రతి పాఠకుడి ఆత్మలో మార్పు నింపుతుందన్నారు.



ప్రవేశ పరీక్షల పుస్తకాల కోసం పియర్సన్

విజయవాడ సిటీలైఫ్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో సీటు దక్కాలంటే నీట్ రాయాలి. ఇంజనీరింగ్, సైన్స్‌లో పీజీ కోసం గేట్(గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్) ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. ఇంజనీరింగ్ కళాశాలల్లో సీటు కోసం జేఈఈ(జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) రాయాలి. ఈ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతోపాటు ఐఐటీ ఫౌండేషన్ కోర్సుల పుస్తకాలు పియర్సన్ పబ్లిషర్స్‌లో ఉన్నాయి. పుస్తక మహోత్సవంలో ప్రధాన వేదికకు ఎదురుగా ఈ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ పుస్తకాలను కొనుగోలు చేయడానికి ఇంజనీరింగ్ ప్రొఫెసర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులు మక్కువ చూపుతున్నారు.

స్టాల్ 168లో సకల భాషల సాహిత్యం

భారతీయ భాషా కథలు, నెత్తురు నది, శవాలను మోసేవారి కథ, గాలిబ్ నాటకాలు, పర్వ... ఇవన్నీ కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన కథలు, నవలలు. దేశంలో ఉన్న భాషలు 24. ఇలా అన్ని భాషల్లో ఉన్న సాహిత్యం పుస్తక ప్రదర్శనలో ఉంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్న రచయితలు రాసిన కథలు, నవలలు, కవితలు ఇక్కడి ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. పుస్తక మహోత్సవంలో కేంద్ర సాహిత్య అకాడమీ స్టాల్ 168లో ఉంది. ఇక్కడ తెలుగు, హిందీ, ఇంగ్లీష్, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో ఉన్న సాహిత్యం కేంద్ర సాహిత్య అకాడమీలో కొలువుదీరింది.

రచయితలకు ప్రత్యేకం '43'

ఒక్కో రచయిత రీతి ఒక్కోలా ఉంటుంది. ఒక్కొక్కరి శైలి ఒక్కోలా ఉంటుంది. ఒక్కొక్కరి దృక్కోణం ఒక్కోలా ఉంటుంది. రచయిత ఎవరైనా వారి కలం నుంచి వచ్చింది మాత్రం సాహిత్యం. ఇలాంటి సాహిత్యమంతా ఒకేచోట పుస్తక మహోత్సవంలో కొలువుదీరింది. ఇందుకోసం రచయితలంతా కలిసి రైటర్స్ స్టాల్ పేరుతో ఒక ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబరు 43లో రచయితలు చేసిన రచనలు ఉన్నాయి.

ఏటా రూ.10 వేలు విలువైన పుస్తకాలు కొనుగోలు చేస్తా



నా చిన్నతనం నుంచి పుస్తక మహోత్సవానికి వస్తున్నా. విజయవాడలోనే పుట్టి పెరిగా. బాల్యం నుంచి అన్ని పుస్తక మహోత్సవాలు చూశాను. ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశాను. ఏటా రూ.10వేలు విలువైన పుస్తకాలు కొనుగోలు చేస్తాను. ఇదివరకు పుస్తక మహోత్సవం జరిగిన అన్ని రోజులు వచ్చేవాడిని. ఇప్పుడు వయస్సు రీత్యా రాలేకపోతున్నా. మూడేళ్లుగా ఒక రోజు వచ్చి అన్ని స్టాల్స్ తిరిగి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నా. మనవరాళ్లకు అవసరమైన తెలుగు, చిత్రలేఖనం పుస్తకాలను కొనుగోలు చేస్తాను. నా ఇంట్లో చిన్న గ్రంథాలయం ఉంది. అనేక పుస్తకాలు ఉన్నాయి. అవి పాతబడిపోయాయి. ఆస్మా ఉండడంతో వాటిని చదువుతున్నప్పుడు ఎలర్జీ వస్తోంది. అందుకే కొత్త పుస్తకాలను కొంటున్నా **- విశ్రాంత ఉపాధ్యాయుడు మురళీ**



కలెక్టర్ డీకే బాలాజీని సత్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, పునీత్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

పట్టుదల, కృషితో ఉన్నత స్థానాలకు చేరండి

» యువకెరటాలులో యువతకు మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, కృషి ఉంటే రుషులవుతారని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని, కష్టపడి లక్ష్యాలను సాధించాలని యువతకు మంత్రి కొల్లు రవీంద్ర ఉద్బోధించారు. హిందూ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన యువకెరటాలు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మారుమూల ప్రాంతంలో పుట్టి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఐఏఎస్ సాధించిన కలెక్టర్ డీకే బాలాజీ అందరికీ ఆదర్శమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కొల్లు ఫౌండేషన్ చైర్మన్ కొల్లు నీలిమ పాల్గొన్నారు.

ప్రొస్టేట్ సమస్యకు వాటర్ వేపర్ థెరపీ

» రాష్ట్రంలో తొలిగా అందుబాటులోకి తెచ్చిన ప్రశాంత్ హాస్పిటల్



వాటర్ వేపర్ థెరపీ యంత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రశాంత్ హాస్పిటల్ వైద్య బృందం

ఆటోనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ సమస్యలకు రెజ్యూమ్ వాటర్ వేపర్ థెరపీని రాష్ట్రంలో ప్రప్రథమంగా ప్రశాంత్ హాస్పిటల్లో అందుబాటులోకి తెచ్చామని హాస్పిటల్ చైర్మన్, యూరాలజిస్ట్ డాక్టర్ కె.ప్రశాంత్ కుమార్ తెలిపారు. అంగస్తంభన సమస్యలున్న వారికి ఈ థెరపీ వరమన్నారు. శనివారం లబ్బీపేటలోని ప్రశాంత్ హాస్పిటల్లో చికిత్సకు వినియోగించే యంత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ప్రొస్టేట్ సమస్య ఉన్నవారికి మందులు వాడడం ద్వారా కొన్నాళ్లపాటు శస్త్రచికిత్సను వాయిదా వేయగలమన్నారు. కానీ, తర్వాత ఐదేళ్లకో, పదేళ్లకో శస్త్రచికిత్స చేసినప్పుడు ఫలితాలు అంత ప్రభావవంతంగా ఉండట్లేదన్నారు. అంగస్తంభన సమస్యకు మందులు, శస్త్రచికిత్సలు చేసినా వీర్యస్ఖలనం సరిగా ఉండకపోవడం కొనసాగుతుందన్నారు. సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతూ రెజ్యూమ్ వాటర్‌థెరపీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ చికిత్స వల్ల 15 రోజుల నుంచి నెలలోపే పూర్తి ఫలితాలు కనిపిస్తాయన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ కె.ధీరజ్, యూరో ఆంకాలజిస్ట్ డాక్టర్ కె.ప్రీతం, యూరో గైనకాలజిస్ట్ అండ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ పి.హరిత, సీవోవో బి.రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా నవదిన ప్రార్థనలు ప్రారంభం



తంబి సమాధివద్ద ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

ఉంగుటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 13, 14, 15తేదీల్లో పెద అవుటపల్లిలో నిర్వహించే బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి తిరునాళ్లను పురస్కరించుకుని శనివారం తంబి పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5.30 గంటలకు వికార్ ఫోరిన్ గన్నవరం ఆర్సీఎం చర్చి గురువు రెవరెండ్ ఫాదర్ పసల థామస్ నేతృత్వంలో ఫాదర్లు, విశ్వాసులు ముందుగా తంబి చిత్రపటం, పతాకాన్ని పుణ్యక్షేత్ర ప్రాంగణంలో ఊరేగించారు. తంబి సమాధి వద్ద పతాకావిష్కరణ చేసి, నవదినప్రార్థనలకు అంకురార్పణ చేశారు. జపమాల, దివ్యబలిపూజలను ఫాదర్ థామస్ సమర్పించారు. మొదటి రోజు ప్రార్థనలను లూర్థునగర్ వాసులు చేశారు. ప్రత్యేకమైన కానుకలను సమర్పించారు. తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవరెండ్ ఫాదర్ పాలడుగు జోసఫ్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ అభిలాష్, సహాయక గురువులు పాల్గొన్నారు.



పరిశ్రమల భద్రతా కమిటీ ఎన్టీఆర్ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆపరేషన్ ఇండస్ట్రీస్

అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో అంతర్భాగంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవాంతరాలు రాకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఇండస్ట్రీ సేఫ్టీ దిశగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం కదిలింది. పారిశ్రామిక ప్రమాదాలను నివారించడం ప్రధానమని గ్రహించి, ఆపరేషన్ ఇండస్ట్రీస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేసేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. అధికార యంత్రాంగాలను తట్టి లేపడంతో పాటు పరిశ్రమల యాజమాన్యాలు వీటిపై దృష్టి సారించేలా అప్రమత్తం చేయాలని నిర్ణయించింది.

- » పరిశ్రమల్లో మాక్‌డ్రిల్ తప్పనిసరి
- » యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం సమష్టి కృషితో ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం
- » పరిశ్రమల భద్రతా కమిటీ ఎన్టీఆర్ జిల్లా సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ /వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కలెక్టరేట్‌లో శనివారం జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో 47 రిజిస్టర్డ్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, వీటిలో 44,096 మంది కార్మికులు పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. కార్మికుల రక్షణకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, కార్మిక శాఖ, ఫ్యాక్టరీలు, కాలుష్యనియంత్రణ మండలి, అగ్నిమాపక అధికారులు సమన్వయంతో ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా క్రైసిస్ కమిటీకి భద్రతా చర్యలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కొండపల్లి, కట్టుబడివారిపాలెంలో గెయిల్ ఇండియా, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎన్టీటీపీఎస్, ల్యాంకో కొండపల్లి పవర్ ప్రాజెక్టు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన ప్రామాణిక విధానాలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కాకుండా ముందుగానే రక్షణ చర్యలు తీసుకున్నట్లయితే కార్మికుల విలువైన ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. పరిశ్రమల్లో ఉన్న చిన్న లోపాలను గుర్తించి తెలియజేసిన కార్మికులకు అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. కర్మాగారాల్లోనే కాకుండా నగరంలోని ప్రధాన వాణిజ్య కూడళ్లు, అపార్టుమెంట్లు, ప్రధాన కాలువలు, రిజర్వాయర్లు ఉండటం వల్ల ఏదైనా ప్రమాద సంఘటన జరిగితే ప్రాణాలు రక్షించుకునేలా అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖలు తప్పనిసరిగా మాక్‌డ్రిల్లు నిర్వహించాలన్నారు. ఏ చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తగదని సూచించారు. క్రైసిస్ గ్రూప్ సభ్యులు కర్మాగారాలలో భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాల నివారణకు, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలకు అటు కార్మికుల్లోనే కాకుండా, ప్రజల్లోనూ అవగాహన కల్పించాలన్నారు. ఐటీఐ కళాశాల విద్యార్థులకు కర్మాగారాల్లో అనుసరించాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న పరిశ్రమల్లో తనిఖీలు చేయాలన్నారు. ఏఏ భద్రతా చర్యలు తీసుకున్నది యాజమాన్యాలు, యంత్రాంగానికి తెలియజేయాలన్నారు.

కార్మికుల రక్షణ ముఖ్యం

పారిశ్రామిక అభివృద్ధి ఎంత అవసరమో, కార్మికుల రక్షణ కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. పొరపాట్లకు తావులేకుండా భద్రతలో, ప్రమాద నివారణలో నిబంధనలను పాటిస్తూ ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని పేర్కొన్నారు. ఒక చిన్న మానవ తప్పిదం వల్ల కార్మికులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం రాకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైసిస్ గ్రూప్ కమిటీ కన్వీనర్ పరిశ్రమల ఉప ముఖ్య తనిఖీ అధికారి ఎం.వి.శివకుమార్ రెడ్డి, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ పి.రాజు, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎ.వి.శంకర్‌రావులతో పాటు ఆయా ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పరిశ్రమల యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

నచ్చకుంటే 22ఏనే!

(3వ పేజీ తరువాయి)

వైసీపీ హయాంలో చిన్న,సన్నకారు రైతులు పలు మార్లు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలను సమర్పించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం రాకతో రైతులు తిరిగి ఆర్డీవోకు వినతి పత్రాలు అందించారు. స్పందించిన ఆర్డీవో నివేదికను కలెక్టర్‌కు పంపారు.

- ● గుడివాడ మండలం వలివర్తిపాడులోని రీసర్వే నెం.180లో తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మధ్యతరగతి వారికి చెందిన 66కుపైగా ప్లాట్‌లను మాజీ మంత్రి కొడాలి నాని తన గడ్డం గ్యాంగ్ ద్వారా కబ్జా చేశారని ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో తిరిగి ఆ ప్లాట్‌లు లబ్ధిదారుల చేతికి వచ్చాయి. అయితే ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. వీటిని కూడా అప్పటి వైసీపీ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. స్థల యజమానులు తమ ప్లాట్‌లను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.
- ● గుడివాడ మండలం లింగవరంలో సుమారు 40 ఎకరాల భూమిని వైసీపీ హయాంలో నిషేధిత జాబితాలో చేర్చారు. వందల ఏళ్లుగా భూమి తమ ఆధీనంలో ఉందని, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నివేదిక వెళ్లినట్లు సమాచారం.
- ● గుడివాడ మండలం లింగవరం పంచాయతీలో మాజీ మంత్రి కొడాలి నాని మరికొందరితో కలిసి సర్వే నంబర్లు 239/1బి, 2, 240/1బి, 3, 244/1, 2ఎ, 2బి, 3, 4, 5, 245/1, 2, 3, 246, 247/1, 2, 3లలో 25.44 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా ఉండేందుకు ఆ భూములను సైతం 22ఏలో చేర్చారు. దీంతో సదరు లేఅవుట్‌లో సుమారు 100 ప్లాట్‌లు కొనుగోలు చేసిన యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇల్లు నిర్మించుకుందామంటే వీలుపడటం లేదని వాపోతున్నారు. కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధమవుతున్నారు.
- ● నందివాడ మండలం తుమ్మలపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెం.78/1సిలో మూడు ఎకరాల సీలింగ్ భూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో సదరు సర్వే నంబర్‌లోని మూడు ఎకరాలకు బదులు 13 ఎకరాలను సీలింగ్ భూమిగా పేర్కొని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చింది. ఈ విషయమై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిషేధిత జాబితా నుంచి తమ భూములను తొలగించాలని రైతులు పెట్టిన అర్జీలన్నీ బుట్టదాఖలయ్యాయి. 10 ఎకరాల్లో భూమి కలిగిన వారంతా సన్న, చిన్నకారు రైతులు కావడం గమనార్హం. నిషేధిత జాబితా నుంచి 10 ఎకరాలను తొలగించి తమను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరుతున్నారు.

ఆ ముగ్గురే ఆదర్శం

(3వ పేజీ తరువాయి)

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించడం అభినందనీయమన్నారు.

విద్యావ్యవస్థకు స్వర్ణయుగం : ఎమ్మెల్యే బొండా ఉమా

సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాష్ట్రంలో విద్యావ్యవస్థకు ఓ స్వర్ణయుగమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎన్డీయే ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందిస్తోందని, తల్లిదండ్రుల కలలు, ఉపాధ్యాయుల కష్టానికి తగ్గట్టుగా విద్యార్థులు ఉత్తీర్ణులై ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. మంత్రి లోకేశ్ చేతులమీదుగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంకావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా అజిత్‌సింగ్‌నగర్‌లో రెండో ఫ్లై ఓవర్ నిర్మాణ ప్రస్తావనను బొండా ఉమా.. మంత్రి లోకేశ్ ముందుంచారు. ఇందుకు లోకేశ్ స్పందిస్తూ.. ఇది సమయం కాదని, మరోసారి ఈ విషయంపై చర్చిద్దామని చెప్పారు.

బ్రెయిన్ డ్రెయిన్ కాకుండా ఏ చర్యలు తీసుకుంటున్నారు

● విద్యార్థులతో మాటామంతిలో లోకేశ్‌ను ప్రశ్నించిన విద్యార్థి

జక్రిరెడ్డి (సీఈసీ మొదటి సంవత్సరం) : రాష్ట్రంలోని యువత ఉద్యోగాల కోసం వేరే రాష్ట్రాలకు, దేశాలకు వెళ్లాల్సి వస్తోందని, ఈ బ్రెయిన్ డ్రెయిన్‌ను నివారించడానికి మన రాష్ట్రంలోనే ఉద్యోగాల కల్పనకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

లోకేశ్ : 1994లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారు. రాష్ట్ర విభజన తర్వాత కట్టుబట్టలతో బయటకు వచ్చాం. కొత్త రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రానికి అన్ని కంపెనీలు తీసుకొచ్చి యువతకు మన రాష్ట్రంలోనే ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. 2014-19 మధ్యలో కియాను అనంతపురం తీసుకొచ్చాం. కియా వల్ల అనంతపురం తలసరి ఆదాయంలో రాష్ట్రంలోనే మూడో స్థానానికి చేరింది. చిత్తూరులో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు తెచ్చాం. ప్రస్తుతం ప్రకాశంలో బయోఫ్యూయల్ రంగంలో పెట్టుబడులకు రిలయన్స్ ముందుకొచ్చింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఆక్వా, డిఫెన్స్, పెట్రో కెమికల్స్, ఉత్తరాంధ్రలో కెమికల్, ఫార్మా, ఐటీ రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. రాష్ట్రంలో విద్యార్థులకు పుష్కలంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

వైష్ణవి (సీఈసీ రెండో సంవత్సరం) : చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ నైతిక విలువల సలహాదారుడిగా నియమించారు. యువతకు ఆయన ఎలాంటి విలువలు నేర్పుతారు.

లోకేశ్ : చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు ప్రత్యేకంగా పుస్తకాలు రూపొందిస్తున్నారు. ఏప్రిల్ వరకు ఆయన కొంచెం బిజీగా ఉన్నారు. ఆ తర్వాత నుంచి విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు కృషి చేస్తారు.

మయూరి (ఎంపీసీ రెండో సంవత్సరం) : ప్రభుత్వ విద్యావ్యవస్థను ప్రైవేట్‌కు ధీటుగా ఉంచటానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

లోకేశ్ : ప్రధానంగా సబ్జెక్టులవారీగా మెటీరియల్, గైడ్స్, క్వశ్చన్ బ్యాంకులు.. తదితరాలు అందించి ఇంటి వద్ద కూడా చదువుకునేలా ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాయి. అలాగే, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు కూడా శిక్షణ ఇచ్చి, మంచి మెటీరియల్ అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. మౌలిక వసతులు, మెరుగైన విద్యాబోధన వంటి వాటిపైనా దృష్టి పెడుతున్నాం.

దటీజ్ లోకేశ్

రమ్య అనే విద్యార్థిని మాట్లాడుతూ కాలేజీ బయట సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని తెలిపింది. గంటల వ్యవధిలోనే స్పందించిన మంత్రి లోకేశ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయేమో పర్యవేక్షించాలని సీపీ రాజశేఖరబాబుకు సూచించారు. చెప్పిన వెంటనే సమస్య పరిష్కరించిన లోకేశ్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వృత్తినైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచి, గ్రామీణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(యూబీఆర్ఎస్ఈటీఐ) కృషి చేస్తోందని సంస్థ డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని యూబీఆర్ఎస్ఈటీఐలో ఈనెల 20, 27 తేదీల్లో ప్రారంభించనున్న వృత్తినైపుణ్య కోర్సుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల 20 నుంచి యువతులకు టైలరింగ్(30 రోజులు), పుట్టగొడుగుల పెంపకం(10 రోజులు), 27 నుంచి జ్యూట్‌బ్యాగ్‌ల తయారీ(13 రోజులు), బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ (30 రోజులు), యువకులకు సెల్‌ఫోన్ రిపేరింగ్(30 రోజులు) కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు, తెలుగులో చదవటం, రాయడం వచ్చి ఉండాలన్నారు. ఆధార్, రేషన్‌కార్డు కలిగిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణులు అర్హులన్నారు. శిక్షణ కాలంలో శిక్షణ, వసతి, భోజనం ఉచితమన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు, కోర్సులకు మెటీరియల్, టూల్‌కిట్లు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. సొంతంగా వ్యాపారం చేసుకునే అభ్యర్థులకు బ్యాంకులనుంచి రుణసౌకర్యం పొందేందుకు సహకారాలు అందిస్తామన్నారు. నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హతల ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలతో జనవరి 20వతేదీ లోపు నేరుగా శిక్షణ కేంద్రానికి వచ్చి పేర్లను నమోదుచేసుకోవాలని, 63042 54730, 94900 11081, 63021 71225లో సంప్రదించాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

గన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కేవీ శివయ్య అన్నారు. మండలంలోని అల్లాపురంలో శనివారం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులను గ్రామాల్లోకి పంపించి సదస్సులు నిర్వహిస్తుందన్నారు. సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్నబాబు ఉపసర్పంచ్ అవుటపల్లి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కేవీ శివయ్య

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కషి చేస్తుందని అందులో భాగంగా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి విద్యనభ్యసించి ప్రయోజకులు కావాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యన భ్యసిస్తున్న వారు ఎక్కువగా పేద వర్గాలకు చెందిన వారే అని కూలీ, నాలీచేసి పిల్లలకు విద్యనేర్పించాలన్న లక్ష్యంతో ఎంతో కష్టపడుతున్నారని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయడం ద్వారా ప్రభుత్వం మంచి పథకాన్ని ప్రారంభించిందన్నారు. సర్పంచ్ గోలి వసంత్ కుమార్, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కాకాని శ్రీనివాసరావు, పొట్లూరి శ్రీనివాసరావు, యెనిగళ్ల కుటుంబరావు, డీవైఈవో పద్మారాణి, ఎంఈవో సుధారాణి, కళాశా పూర్వ విద్యార్థి, రిటైర్డు బ్యాంకు మేనేజర్ కె.తిలక్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యా దాతల త్యాగనిరతి మరువరానిది

దేశ భవిష్యత్తును నిర్ణయించే విజ్ఞాన కేంద్రాలైన పాఠశాలలను స్థాపించి గ్రామాల్లో సైతం విద్యనభ్యసించి ప్రయోజకులయ్యేందుకు కారకులైన నిస్వార్థ సేవకులను గుర్తుచేసుకోవడం ఎంతో ఆనందదాయకమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. కడవకొల్లులో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల స్థాపించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన శతాబ్ధి ఉత్సవంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ఉయ్యూరు పరిసర గ్రామాల్లో పాఠశాలలు లేని రోజుల్లో ఆయా గ్రామాలకు పయోగపడేలా కడవకొల్లులో 1925 సంవత్సరంలో పాఠశాల ప్రారంభించిన ఉయ్యూరు ఎస్టేట్ జమిందార్ మేకా వెంకటాద్రి అప్పారావు, తరువాత పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసిన కడవకొల్లుకు చెందిన అరిగపూడి వెంకటరామయ్య సేవలు చిరస్మరణీయమన్నారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఉన్నం చిన్నారి, పాఠశాల వ్యవ స్థాపక వారసుడు అరికపూడి రాజేంద్రప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

కంకిపాడు : నియోజకవర్గ అభివృద్ధే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకి గద్దె రామ్మోహన్ ఆర్టీసీ కాలనీలో రూ. 32 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను శనివారం ఆయన శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లను రూ. 54 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. సంక్రాంతి నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్థానికులు

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

కంకిపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం కేసరపల్లి లో ఆదివారం నిర్వహించే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని వివిధ సంఘాల నాయకులు చలవాది రాజా, వణుకూరు విక్రమ్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైందవ శంఖారావం మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల రాజా, అన్నవరపు శివపార్వతి, షేక్ బాజి, అన్నే రామారావు, బొర్రా వెంకట్, ఏనుగ జయ, నాని, కొండా నాగేశ్వరరావు, వడ్డాది శ్రీను, కొడాలి సురేష్, చుట్టూరి తదితరులు పాల్గొన్నారు.



శంఖారావంపై సమరసత ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ : దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కావాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కేసరపల్లిలో జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం జంక్షన్‌లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జంక్షన్ నాలుగు రోడ్లలో ర్యాలీగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ మండల అధ్యక్షుడు ఎదురువాడ శ్రీనివాసరావు, సమరసత గన్నవరం ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు, బాపులపాడు మండల సహ కన్వీనర్ దావులూరి శ్రీహరి, ఎస్ఎస్ఎఫ్, ఆర్యవైశ్య సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంఈవోకి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజనపథకం కార్మికులు

మెనూ చార్జీలు పెంచాలి

ఉంగుటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మెనూ చార్జీలు పెంచకుండా కొత్తగా ప్రవేశపెట్టిన మెనూ అమలు చేయమనటం సహేతుకం కాదని మధ్యాహ్న భోజనపథకం కార్మిక సంఘం మండల కార్యదర్శి సయ్యద్ మహబూబీ అన్నారు. మధ్యాహ్న భోజనపథకం కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎంఈవో-2 జె.సాంబశివరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగలక్ష్మి, కోటేశ్వరి, అన్నపూర్ణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ఉయ్యూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడ రేషన్ సౌజన్యంతో ట్రస్ట్ కార్యదర్శి నీరజ అందజేశారు. ట్రస్ట్ ట్రెజరర్ కె.స్వరూపరాణి, రిటైర్డ్ ఎంఈవో విశ్వమోహన్, కె.శివ నాగేంద్రం, బి.రాజేశ్, గోపాల్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు జడ్పీహైస్కూల్ పూర్వవిద్యార్థి, విశ్రాంత అధ్యాపకుడు కొయ్యగూరపాడుకు చెందిన దోనేపూడి రంగారావు తన తల్లిదండ్రులైన దోనేపూడి వెంకటేశ్వరరావు, సరస్వతిల జ్ఞాపకార్థం టెన్త్ విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఎంఈవో-2 జె.సాంబశివరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చోరగుడి అనిత, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ పులి శ్రీనివాసరావు, సెక్రటరీ అనంతయ్య, ఉపాధ్యాయులు అమ్మన్న పాల్గొన్నారు.

బీజేపీ బాపులపాడు మండల అధ్యక్షుడిగా చింతారావు

హనుమాన్‌జంక్షన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : బీజేపీ బాపులపాడు మండల అధ్యక్షుడుగా పెరికీడు గ్రామానికి చెందిన కెల్లా చింతారావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. శనివారం నిక విజయవాడ రోడ్డులో బీజేపీ కార్యాలయంలో మండల మాజీ అధ్యక్షుడు జింకా నలగామరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతనంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి శేషకుమార్, జిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట మురళీధర్, మాణిక్యాలరావు. శ్రీనివాసరావు తదితరులు నూతన మండల కమిటీని అభినందించారు.

మల్లవల్లి పారిశ్రామికవాడలో

శరవేగంగా అభివృద్ధి పనులు



చెట్లను తొలగిస్తున్న యంత్రాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి పారిశ్రామికవాడలో చెట్ల తొలగింపు, రహదారి నిర్మాణ పనులు శనివారం కూడా కొనసాగుతున్నాయి. మల్లవల్లి గ్రామంతో పాటు పారిశ్రామికవాడకు వెళ్లే రహదారులపై కూడా పోలీస్ పికెట్ కూడా కొనసాగుతోంది. మల్లవల్లి పారిశ్రామిక వాడలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ఫేజ్-1లో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన పనులు ఎట్టకేలకు ఆచరణలోకి వచ్చాయి. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, బాపులపాడు తహసీల్దార్ నాగభూషణం పర్యవేక్షణలో రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తదితరులు పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఆది, సోమవారల్లో కూడా పనులు జరిగేలా కార్యాచరణ సిద్ధం చేసినట్టు సమాచారం. మరోవైపు అర్హులైన వారికి నష్టపరిహారం ఇవ్వకుండా పనులు చేయడం సరికాదంటూ రైతు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జీతాలివ్వక పోతే 16 నుంచి సమ్మె



తాడిగడప కమిషనర్‌కు సమ్మెనోటీసు అందచేస్తున్న సీఐటీయూ నాయకులు

పెనమలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపాలిటీలో తడి పొడి చెత్త వ్యాన్ డ్రైవర్లకు మూడు నెలలుగా బకాయి ఉన్న జీతాలు సంక్రాంతి పండుగ నాటికి చెల్లించకపోతే 16వ తేదీనుంచి సమ్మె చేస్తామని మండల సీఐటీయూ నాయకుడు ఉప్పాడ త్రిమూర్తులు హెచ్చరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో తడిపొడి చెత్త వ్యాన్ డ్రైవర్లు శనివారం తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌ను కలసి సమ్మెనోటీసు అందచేశారు. సీఐటీయూ కార్యదర్శి మస్తాన్‌వలి, డ్రైవర్ల అధ్యక్షుడు నరేంద్ర, కార్యదర్శి నరసింహారావు, సురేశ్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



శిలాఫలకంపై తమ పేర్ల వద్ద పూర్వ విద్యార్థులు

సెయింట్స్‌లో పూర్వ విద్యార్థుల కలయిక

గన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఎస్ సెయింట్ జాన్స్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబరాలను శనివారం జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా వచ్చి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి గురువులు, ప్రిన్సిపాల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి పేరు శిలాఫలకంపై ముద్రించామన్నారు. బ్యాంచ్‌ల వారీగా పేర్లు వేశామన్నారు. పూర్వ విద్యార్థులు అప్పు డప్పుడు కలుస్తూ ఉంటేనే స్నేహ బంధం ముడిపడి ఉంటుందన్నారు. రెవరెండ్ బ్రదర్ జాకోబ్, జోసఫ్, జయహో, బాలశౌరి, జిమ్మికురియాకోస్ తదితరులు పాల్గొన్నారు.

గాయని సునీతకు ఘనస్వాగతం



గాయని సునీతను సత్కరించి అభయాంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న సాయికల్యాణి

హనుమాన్‌జంక్షన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ నేపథ్య గాయని సునీతకు శనివారం టీడీపీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి కుటుంబ సమేతంగా ఘనస్వాగతం పలికారు. శనివారం సునీత ద్వారక తిరుమల నుంచి గన్నవ రం విమానాశ్రయంకు వెళుతూ మార్గమధ్యలో టీడీపీ మహిళా నాయకురాలు మూల్పూరి సాయికల్యాణి నివాసంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం గన్నవరం వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, తెలుగునాడు అంగన్వాడీ డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బొప్పన నీరజ, తెలుగు రైతు రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెందుర్తి శ్రీకాంత్, సుధీర్, సాయికల్యాణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న అయోధ్య అపార్టుమెంట్స్ బాధిత కార్మికులు

గన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించా లని మేస్త్రులు రామ్మోహనరావు, సతీష్‌లు డిమాండ్ చేశారు. గన్నవరం అపార్టుమెంట్స్ నిర్మాణంలో పనిచేసిన కార్మికులకు రూ.4కోట్లు బకాయిలు చెల్లించాలని కోరుతూ చేస్తున్న రిలే దీక్షలు శనివారానికి 39వ రోజుకు చేరాయి. గత వైసీపీ ప్రభుత్వం అండ చూసుకుని ఎన్నో ఇబ్బందులు పెట్టారని వాపోయారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశతో ఉన్నామని బాబు, వెంకన్న, తేజ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీలను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పేదల ఆరాధ్య దైవం సీఎం చంద్రబాబు

ప్రసాదంపాడు/ గన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పేదలు అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు ఎల్‌వోసీలు ఇస్తూ అభాగ్యుల పాలిట ఆరాధ్య దైవంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న బాధితుల కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీలను అందజేశారు. ఆత్కూరుకు చెందిన వీరమాచినేని శ్రీహరికి రూ.90 వేలు, మల్లవల్లికి చెందిన వేముల గంగయ్యకు రూ.3,50,000లు, సూరంపాలెంకు చెందిన కలపాల వేణుబాబుకు రూ.2 లక్షల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేస్తున్న అనుమోలు ప్రభాకర్, ఆనంద్

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

కంకిపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అవసరమైన కార్పొరేట్ వైద్య సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర్ అన్నారు. పెనమలూరు మండలంలోని యనమలకుదురు గ్రామానికి చెందిన పుప్పాల రాంబాబుకు అవసరమైన రూ. 3 లక్షల ఎల్‌వోసీని శనివారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అనుమోలు ప్రభాకర్ మాట్లాడుతూ, నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారంటే తాను ఇబ్బందుల్లో ఉన్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఫీలు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు కోయా ఆనంద్ ప్రసాద్, బోడె సురేంద్ర, జుజ్జువరపు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి) : పేదలకు ఇచ్చిన సీలింగ్ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తే వ్యవసాయానికి అవసరమైన సహకారం అందుతుందని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కోరారు. బండారుగూడెంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వీఆర్వో, సర్వేయర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్వేయర్ మౌనిక, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి సిద్ధం

● తరలిరానున్న స్వామీజీలు, సాధువులు, హిందూ కుటుంబీకులు





పోలీసులకు సూచనలిస్తున్న ఐజీ అశోక్ కుమార్, ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

గన్నవరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ ప్రాంగణం సిద్ధమైంది. గన్నవరం మండలం కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ వద్ద ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆదివారం 12 గంటలకు శంఖారావం సభ ప్రారంభం కానుంది. భారీ స్టేజీ నిర్మించారు. పక్కనే స్క్రీన్‌లు పెట్టారు. లక్ష మంది కూర్చునేలా కుర్చీలు వేశారు. స్టేజీ ముందు హైందవ శంఖారావం అంటూ రంగులు దిద్దారు. 30 ఎకరాల్లో జరిగే బహిరంగ సభకు 3 లక్షలకు పైగా రాష్ట్ర నలుమూలల నుంచి హిందూ కుటుంబీకులు రానున్నారు. వీరికోసం అన్ని ఏర్పాట్లు చేశారు. పీఠాధిపతులు, సాధువులు, వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అఖిల భారత సంఘటన ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, సంయుక్త కార్యదర్శి కోటేశ్వరశర్మ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవిందదేవ్ గిరి మహరాజ్ తదితర ప్రముఖులు హాజరై ప్రసంగించనున్నారు. 150 ఎకరాలకు పైగా పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేశారు. పార్కింగ్ ప్రాంతాల వద్ద పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తారు. వాహనంలోనే డ్రైవర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. 5 ప్రాంతాల్లో భోజన ఏర్పాట్లు చేశారు. ఒక్కోచోట 50 వేల మందికి పైగా భోజనాలు చేసేలా ఏర్పాట్లు చేశారు. వీఐపీలకు ముందు గ్యాలరీలో కుర్చీలు వేశారు.

అప్రమత్తంగా ఉండాలి: ఐజీ, ఎస్పీ

హైందవ శంకారావానికి బందోబస్తు నిర్వహించే క్రమంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఏ ఒక్కరు నిర్లక్ష్యం వహించిన సహించేది లేదని ఐజీ అశోక్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం బహిరంగ సభకు బందోబస్తు చేసే పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ హైందవ శంఖారావం సభ మతపరమైనదని జాగ్రత్తగా ఉండాలన్నారు. సభకు వచ్చేవారంతా క్రమశిక్షణతో ఉంటారన్నారు. రైళ్లల్లో, బస్సుల్లో, కార్లలో, బైకుల్లో వస్తున్నారని ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. రిపోర్టు చేయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ సభ ముగిసిన వెంటనే ఎవరు వెళ్లవద్దని, చివరి వాహనం వెళ్లేవరకూ ట్రాఫిక్ సిబ్బంది ఉండాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే సమాచారం చెప్పగానే అక్కడికి మరింత మంది సిబ్బందిని పంపించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు పై అధికారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ 3వేల మందికి పైగా పోలీసు సిబ్బందితో పాటు 3500 మంది వలంటీర్ సేవలందిస్తారన్నారు. ఉప్పులూరు రైల్వే స్టేషన్ నుంచి వచ్చేవారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారని, వారిని వరస క్రమంలో సభకు వచ్చేలా చూడాలన్నారు. ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అందరూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, బీవీ శివప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి

మండలంలోని కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఆదివారం జరగనున్న హైందవ శంఖారావం సభ ఏర్పాట్లను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు.



హెల్త్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

ఎంటీ కృష్ణబాబుకు ఆర్టీసీ నేతల శుభాకాంక్షలు

బస్టేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హెల్త్) ఎంటీ కృష్ణబాబును సెక్రటేరియట్‌లో శనివారం ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల మెడికల బిల్లుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందిస్తూ బిల్లుల పరిష్కారంలో తన వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. నేతలు పుట్టపర్తి వెంకటరమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, విశ్వమోహన్, అనంతరాములు, పి.ఎస్.రెడ్డి, కళ్యాణ్, వాసు పాల్గొన్నారు.

నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ

కృష్ణలంక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్‌లో భాగంగా (సీడ్ యాప్) ముస్లిం, క్రిస్టియన్, బుద్ధిష్ట్, పార్శీ, జైన్ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆసక్తి గల రంగంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎస్.కె.ఫర్జానా బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో వసతి, భోజనం, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 3 నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. అర్హులైన మైనార్టీ యువత బయోడేటా, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్, అర్హత కలిగిన సర్టిఫికెట్స్, చిరునామా, ఫోన్ నెంబరుతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా, ఎన్టీఆర్ సర్కిల్ బ్రాంచ్, పటమట, విజయవాడ వారికి అందచేయాలన్నారు. వివరాలకు 8008879191, 0866-2571125, 0866-2491148 నెంబర్లను సంప్రదించవచ్చని ఫర్జానా బేగం తెలిపారు.

కోడిపందేలకు బరులు సిద్ధం

పందెపురాయుళ్లను ఆకర్షించేందుకు ఎన్ ఫీల్డ్ బైకులు, యాంకర్లు సిద్ధం



పెదపూడిలో బరి కోసం సిద్ధం చేస్తున్న పొలం

కూచిపూడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కోడిపందేల బరులు సిద్ధమవుతున్నాయి. పొలాలను ట్రాక్టర్లతో దున్ని చదును చేసి స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. పెదపూడి, కోసూరు గ్రామాల్లో నిర్వాహకులు కోడిపందేలకు సంబంధించి బరుల పనులు ముమ్మరం చేశారు. ఎక్కువ మంది పందెం రాయుళ్లు తమ బరుల్లో పందాలు వేసుకునేలా వారిని ఆకర్షించేందుకు విలువైన ఎన్ ఫీల్డ్ బైకులు, యాంకర్లతో సిద్ధంగా ఉన్నారు. ఎక్కువ పందాలు గెలిచిన వారికి బైక్‌లు బహుమతిగా ఇవ్వనున్నారు. యాంకర్లను దింపి పందాల రాయుళ్లను ఆకర్షించే సరికొత్త ఆలోచనకు శ్రీకాకుళం చుడుతున్నారు. 3 రకాల బరులు ఏర్పాటు చేస్తున్నారు. రూ.లక్ష ఆపై పందాలు కాసేవారికి పెద్ద బరి, రూ.50వేలు, రూ.25వేలకు రెండు బరులు సిద్ధం చేస్తున్నారు.

స్టాల్స్‌కు పెరిగిన డిమాండ్

కోడిపందేల బరుల్లో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు వ్యాపారస్థులు, నిర్వాహకులతో ఒప్పందాలు కుదుర్చుకుని అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. బరుల్లో వ్యాపారాలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో నిర్వాహకుల చుట్టూ వ్యాపారస్థులు క్యూ కడుతున్నారు. బరుల్లో వ్యాపారులు బిర్యానీ, కూల్ డ్రింక్స్, టిఫిన్ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. కోడిపందేలతోపాటు ఇతర జూద క్రీడలైన పేకాట, మూడు ముక్కలాట, గుండాట, చిత్తులాటలు కూడా ఏర్పాట్లయ్యే అవకాశాలున్నాయి. భోగి, పండుగ, కనుమ 3 రోజులపాటు రాత్రి వేళల్లోనూ, ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పందాలు వేసుకునేలా నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

అంబేడ్కర్ వర్సిటీ ఏర్పాటుకు కృషి

● జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్



వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీని ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వర్సిటీ నెలకొల్పేందుకు కృషి చేస్తామని జనసేన ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పి.హరిప్రసాద్ తెలిపారు. దీనికోసం సిద్ధం చేసిన ప్రతిపాదనలను ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసి వర్సిటీ ఓఎస్డీ డాక్టర్ వెలగా జోషి అందించారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ గత 10 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోనూ సేవలందించింది. విభజన చట్టంలోని 10వ షెడ్యూల్లో 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో వర్సిటీ అడ్మిషన్లు క్లోజ్ అయ్యాయి. దీంతో విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, ఏడాదికి 30 వేల మందికి పైగా విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందని జోషి ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు తెలిపారు. సంబంధిత డీపీఆర్‌లను జోషి సిద్ధం చేశారు. దీనిపై ప్రభుత్వంలో ఉన్నతస్థాయిలో చర్చలు జరిగాయి. ఆర్థికపరమైన అనుమతులు, న్యాయ సంబంధమైన అనుమతులు పూర్తయ్యాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వర్సిటీ నెలకొల్పే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై జోషి ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నెలకొల్పడానికి సహకరిస్తామని హరిప్రసాద్ హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి వర్సిటీ ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

‘సిద్ధార్థ’ వార్షికోత్సవానికి రండి..!

● మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం



ప్రసాదంపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించే సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వార్షిక దినోత్సవం, కాలేజ్ ఫెస్ట్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ నూరెడ్డి విష్ణు, సిద్ధార్థ అకాడమీ వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. సిద్ధార్థ సంస్థల్లో పాఠ్యాంశాల నాణ్యత ప్రమాణాలను, కంప్యూటర్ విద్యలో విద్యార్థులు చూపే ప్రతిభలను మంత్రికి వివరించారు. కళాశాలలో రూ.20 కోట్ల నిధులతో క్రీడా స్టేడియాన్ని నిర్మించినట్టు వెల్లడించారు. అనంతరం మంత్రి లోకేష్ కళాశాల వార్షికోత్సవానికి వచ్చేందుకు అంగీకరించినట్టు వారు తెలిపినట్టు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

తెలుగులో ఉత్తర్వుల నిర్ణయంపై హర్షం

విజయవాడ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ ఉత్త ర ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులు ఇకనుంచి తెలుగులో ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయిస్తూ ఆదేశాలివ్వడంపై ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచందు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ తెలుగు రచయితల 6వ మహాసభలు చేసిన విజ్ఞాపనను మన్నిస్తూ మహాసభలు జరిగిన మూడు రోజులకే ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం గర్వకారణంగానూ, మొక్క నాటగానే ఫలించినంత సంతోషంగానూ ఉందన్నారు. నిన్నటి మహాసభలు మొ త్తం 18 తీర్మానాలు చేసింది. వాటిలో పాలనాపరంగా చేపట్టాల్సిన అంశాల ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరిస్తామని రాష్ట్రమంత్రులు కం దుల దుర్గేష్, సత్యప్రకాష్ యాదవ్ ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు డూండీ రాకేష్ ప్రమాణ స్వీకారం

వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డూండీ రాకేష్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు వన్‌టౌన్‌లోని గాంధీజీ ము నిసిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జరగనుంది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఆర్యవైశ్య నేతలు, ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నేతలు, శ్రే ణులతో పాటు టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రానున్నారు.



పురందేశ్వరిని ఆశీర్వదిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

స్వామీజీ దీక్ష విజయవంతం కావాలి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

పటమట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గణపతి సచ్చిదానంద స్వామి తలపెట్టిన 52 రోజుల ఆధ్యాత్మిక దత్తక్షేత్రయాత్ర విజయవంతం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆకాంక్షించారు. శనివారం ఆమె విజయవాడ పటమట దత్తపీఠంలో గణపతి సచ్చిదానంద స్వామిజీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు స్వామిజీ తలపెట్టిన యాత్ర నిరాటంకంగా కొనసాగాలని కోరుకున్నట్టు తెలిపారు. పాతూరి నాగభూషణం పాల్గొన్నారు.

టైరు పేలి ఆటో బోల్తా, మహిళ మృతి

● తొమ్మిది మందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో (ఇన్‌సెట్లో) మృతురాలు మునియమ్మ

విస్సన్నపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట శివారు ఎ.కొండూరు రోడ్డులో శనివారం ఆటో టైర్ పేలడంతో జరిగిన ప్రమాదంలో ఒక మహిళా కూలీ మృతి చెందగా, 9 మంది గాయాల పాలయ్యారు. విస్సన్నపేట మండలం కొండపర్వ దళితవాడకు చెందిన 15 మంది మహిళా కూలీలు శనివారం ఎ.కొండూరు మండలానికి మిర్చి కోత పని నిమిత్తం విస్సన్నపేటకు చెందిన తేల్లూరి ఆనంద్ ఆటోలో తరలివెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా విస్సన్నపేట శివారు ఎన్.ఎస్.పీ కాలువ సమీపంలో ఆటో ఎడమ వైపు ఉన్న టైరు ఒక్కసారిగా పేలడంతో ఆటో ప్రమాదానికి గురై అందులోని 15 మంది కూలీలు రోడ్డుపై పడిపోయారు. ఆటో నుజ్జునుజ్జయింది. ఈ 15మందిని 108 అంబులెన్స్‌లో విస్సన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ దోనెళ్లి మునియమ్మ (38) మృతిచెందగా ఆటోడ్రైవర్ ఆనంద్, చాట్ల మరియమ్మ తీవ్రంగా గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనస్థలం వద్దకు చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయాల ఆధునికీకరణకు ప్రాధాన్యం

● దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం



మంత్రి రామనారాయణ రెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామచంద్ర మోహన్, డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు.

వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాల ఆధునీకరణకు ప్రాధాన్యత ఇస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభమైన తరువాత తొలిసారిగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, సిబ్బంది, అర్చకులు సంప్రదాయ మర్యాదలు అందజేశారు. దుర్గమ్మకు మంత్రి పేరిట ప్రత్యేక అర్చనలు జరిగాయి. అనంతరం ఆయనకు వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. ఈవో రామచంద్ర మోహన్, డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు మంత్రికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులతో సమావేశమై ఆలయాభివృద్ధి గురించి చర్చించారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం సులభంగా అయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుతూ దేవాలయాల ఆధునీకరణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

1.48 లక్షల మంది జూనియర్ కళాశాల

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

» రాష్ట్రవ్యాప్తంగా 475 కాలేజీల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ‘ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 475 జూనియర్ కళాశాలల్లో 1.48 లక్షల మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాం.’ అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రాష్ట్రంలో మొదటిసారి జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ఈ పథకానికి రూపకల్పన చేశారన్నారు. జీవితంలో కష్టపడేతత్వాన్ని అలవరచుకోవాలని, కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని విద్యార్థులకు కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ సూచించారు. ప్రిన్సిపాల్ వి.సుందరలక్ష్మి కళాశాల ప్రగతి నివేదికను వివరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, డీఈవో పీవీజే రామారావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పీబీ సాల్మన్‌రాజు, ఎంఈవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పెచ్చుమీరుతున్న మతోన్మాదం

సీపీఎం మహాసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

తిరువూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని, మతోన్మాదం పెచ్చుమీరుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం సీపీఎం 25వ జిల్లా మహాసభ ప్రారంభం సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు గుళ్లపల్లి వెంకటరత్నం(చినబాబు), సీతారాం ఏచూరి ప్రాంగణం వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఇతర పార్టీలపైన ఆధారపడి కేంద్రంలో పాలన సాగిస్తున్న మోదీ, ఆ పార్టీల్లో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను అడ్డుపెట్టుకుని మతతత్వాన్ని ప్రజలపై రుద్ది, సమాజంలో ప్రజల మధ్య బీజేపీ విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. వికసిత్‌భారత్ పేరుతో మోదీ ప్రజావ్యతిరేక చట్టాలను తెరపైకి తెస్తున్నారన్నారు. నిర్బంధ హిందుత్వ అజెండాను అమలు చేయడమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలును విస్మరించిందన్నారు. ప్రజలు సంఘటితంగా ప్రజావ్యతిరేక పాలకులపై పోరాటం సాగించాలని, సీపీఎం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. మహాసభలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావు, బొమ్మసాని తులసీరావు, డీవీ కృష్ణ, సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, మేకల నాగేంద్రప్రసాద్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ ప్రసంగించారు.



సీపీఎం మహాసభలో ప్రసంగిస్తున్న వి.వెంకటేశ్వరావు

మహిళ ఆత్మహత్యాయత్నం

గుణదల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.8లక్షలకు టోకరా వేయడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గుణదల మురళీనగర్లో శనివారం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బండి ఆశ (35) తన పిల్లలతో గుణదల మురళీనగర్లో నివాసం ఉంటుంది. ఆర్మీలో పనిచేసే గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన ఆళ్ల రామకృష్ణ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆమెను పశ్చిమబెంగాల్ వచ్చేలా చేశాడు. అక్కడ రూ.8లక్షలు ఖర్చవుతుందని తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగం గురించి అడిగితే తన భార్య పేరుతో విజయవాడకు రైలు టికెట్ తీసి ఆశను బలవంతంగా పంపేశాడు. తర్వాత ఎన్నిమార్లు ఫోన్‌చేసినా ప్రయోజనం లేదు. మోసపోయానని గ్రహించి నవంబరు 25న స్పందనలో ఫిర్యాదు చేసింది. డిసెంబరు 5న కేసును పరిశీలించి దరఖాస్తును గుణదల పోలీస్‌స్టేషన్‌కు పంపడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో తాను పూర్తిగా మోసపోయానని గ్రహించి మనస్తాపానికి గురై శనివారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. స్థానికులు గమనించి రక్షించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తూ కాలువలో పడి వృద్ధుడి మృతి

వన్‌టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకకు చెందిన ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణలంక, ఆనందభవన్ రోడ్డులో తమ్మినీడి లక్ష్మీనారాయణ (85) భార్యతో కలిసి ఉంటున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె. పదేళ్ల క్రితం కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రస్తుతం లక్ష్మీనారాయణ దంపతులు వయస్సు రీత్యా అదేరోడ్డులో ఉంటున్న అతడి కుమార్తె కేతినేడి అనంతలక్ష్మి వద్ద ఉంటున్నారు. ఇతడికి పక్షవాతం, బైపాస్ సర్జరీ జరిగింది. కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం లేకపోవటం, జ్ఞాపకశక్తి తగ్గటంతో అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళుతుంటాడు. కుమార్తె, బంధువులు ఆయన్ను వెతికి ఇంటికి తీసుకొస్తుంటారు. ఈక్రమంలో శనివారం ఉదయం అనంతలక్ష్మి, ఆమె భర్త విజయవాడ రైల్వే ఆసుపత్రికి వెళ్లారు. మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో లక్ష్మీనారాయణ ఇంటిలో నుంచి బయటకు వెళ్లి అమెరికన్ ఆసుపత్రి సమీపంలోని దోబీఘాట్ అరుగుపై కూర్చొన్నాడు. ప్రమాదవశాత్తు అతడు కాలువలో పడి కొట్టుకెళ్తుండగా స్థానికులు అతడిని కాపాడి ఒడ్డుకు తెచ్చారు. అతడిని గుర్తు పట్టిన కొందరు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటనా ప్రాంతానికి వెళ్లి లక్ష్మీనారాయణను పరిశీలించగా, అప్పటికే చనిపోయినట్టు తెలిసింది. మృతుడి కుమార్తె అనంతలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

ఉపాధి పనులు త్వరగా పూర్తి చేయాలి



గుడివాడ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను త్వరగా పూర్తి చేయటానికి ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలనిపై ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా నిర్దేశించిన పనులను స్థానిక ప్రతినిధులతో మాట్లాడి అత్యవసరమైన పనులను త్వరగా చేయాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ లెక్కలను తమకు అందజేయాలన్నారు.

జాబ్‌మేళా 7న

గుడివాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీ -సీడాప్, కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన ఐటీఐ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్.పి.నరేష్‌కుమార్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ఎల్.గౌరీ మణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్, పాన్, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 9848819682, 9988853335, 8712655686, 8790118349, 8790117279లకు సంప్రదించాలని వారు కోరారు.

అంగన్వాడీచిన్నారులకు పుస్తకాల పంపిణీ

గుడివాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : స్థానిక 11వ వార్డులోని అంగన్‌వాడీ 1,2,3,4లోని 60మంది చిన్నారులకు టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు జబీన్ పుస్తకాలను పంపిణీ చేశాడు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ప్రతి అంగన్‌వాడీలోను పిల్లలకు పౌష్టికాహారం, చక్కటి విద్య అందేలా కృషి చేస్తున్నారన్నారు. నాయకులు పట్టపు చిన్నా, అస్మా, సయ్యద్ గఫార్, ఐసిడిఎస్ సిడిపివో విజయ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్ నాగజ్యోతి, టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్, పట్టణ అర్బన్ ప్రాంతాల్లో అంగన్‌వాడీ పరిధుల్లో మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు ఎర్లీ చైల్డ్ పథకం కింద పిల్లలకు పౌష్టికాహారం అందించారు. నూజెళ్ల, చిరుచింతల, బొమ్ములూరు, మోటూరు, దొండపాడు, లింగవరం, వలివర్తిపాడు తదితర గ్రామాల్లో పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



రుద్రపాక జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణవీరయ్యతో కలిసి ప్రారంభించారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తుందన్నారు. అందరూ బాగా చదువుకుని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కళాశాల అభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావును ఆయన అభినందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, పాలడుగు నానారావు, డేవిడ్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాసరావు, లలిత కుమారి, అధ్యాపకులు కావూరి నిర్మల కుమార్, బుజ్జిబాబు, సింధూర భాగ్యలత, శాంతకుమారి, నరసింహారావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పామర్రు ప్రభుత్వ కళాశాలలో..

పామర్రు : నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలకు మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థినులతో కలసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఎంఈవో గుమ్మడి పద్మావాణి, జడ్పీ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆలపాటి ఇందిరా రాణి, ఎస్సై రాజేంద్రప్రసాద్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

మొవ్వ క్షేత్రయ్య కళాశాలలో..

కూచిపూడి : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి నేతలు, అధికారులు శనివారం ప్రారంభించారు. భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు కోరారు. తొలి రోజున 260 మంది విద్యార్థులు భోజనం చేశారు. సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంఈవో కె.శ్రీలక్ష్మి, తహసీల్దార్ మస్తాన్, తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రసాద శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు శనివారం నుంచి డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. మండలంలోని కౌతవరం జిల్లా పరిషత్ హైస్కూల్, అంగలూరు బాలికల హైస్కూల్ ఇంటర్ విద్యార్థులకు ఎంఈవోలు జగన్మోహనరావు, గోపాలరావు ఆధ్వర్యంలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం భోజనం పెట్టి ప్రారంభించారు.



కపిలేశ్వరపురం జడ్పీ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఉయ్యూరు న్యాయాధికారి కె.శ్రీహరి

చట్టాలపై అవగాహన అవసరం

ఉయ్యూరు న్యాయాధికారి కె.శ్రీహరి

పమిడిముక్కల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచి చట్టాలపై అవగాహన అవసరమని ఉయ్యూరు న్యాయాధికారి కె.శ్రీహరి అన్నారు. కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మాన అక్రమ రవాణా, లైగింక వేధింపుల నిరోధక చట్టాలపై వివరించారు. హైకోర్టు న్యాయవాది చిగులూరి కృష్ణారావు, ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపిచంద్, శ్రీకృష్ణకుమార్, గీతాంజలి, పాఠశాల హెచ్‌ఎం ప్రకాశరావు, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు పాల్గొన్నారు. విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు కృష్ణారావు అందజేశారు. టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ. 10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి అందచేస్తానన్నారు.



అన్నక్యాంటీన్‌లో అన్నవితరణ చేస్తున్న సురేంద్రబాబు

ఉపాధ్యాయురాలు వాణి సేవలు చిరస్మరణీయం

గుడివాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దావులూరి వాణి అంకిత భావంతో పని చేసి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దారని వక్తలు పేర్కొన్నారు. ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద అన్నక్యాంటీన్‌లో దావులూరి వాణి ఆరో వర్ధంతి సందర్భంగా ఆమె భర్త, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు 450 మంది పేదలకు అన్నవితరణ చేశారు. వల్లభనేని వెంకటరత్నం, వేములపల్లి రామకృష్ణ, డాక్టర్ వంగిపురపు నవీన్‌కుమార్ మాట్లాడుతూ సతీమణి పేరున సురేంద్రబాబు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ, టీడీపీ నాయకులు మెరుగుమాల బ్రహ్మయ్య, నరసింహారావు, సీతారామస్వామి, బచ్చు రాధాకృష్ణ, గోపిరెడ్డి రామకృష్ణ, ఘంటసాల రామకృష్ణ, యార్లగడ్డ సుబ్బారావు, పుల్లేటికుర్తి శ్రీనుబాబు, చాగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బోరు పంపులకు భూమిపూజ

గుడివాడ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిరుచింతల గ్రామంలో రూ. 1.77 లక్షల నిధులతో శనివారం నాలుగు చోట్ల బోరు పంపులకు మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ భూమి పూజ చేశారు. కార్యదర్శి కె.అనూల, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరుల ఆధ్వర్యంలో బోరు వేయటానికి భూమి పూజలు నిర్వహించారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయండి



గుడివాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గన్నవరంలో ఆదివారం జరిగే హైందవ శంఖారావం సభకు అశేషంగా తరలివచ్చి జయప్రదం చేయాలని విశ్వ హిందూ పరిషత్ గుడివాడ అధ్యక్షురాలు జొన్నలగడ్డ కుమారి పిలుపునిచ్చారు. పాత మున్సిపల్ కార్యాలయం రామాలయం ఆవరణలో హైందవ సంఘాల పెద్దలు సమావేశం నిర్వహించారు. హైందవ శంఖారావానికి తరలివెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునిల్, హైందవ సంఘాల పెద్దలు చలమచర్ల కృష్ణమాచార్యులు, టంగుటూరి శ్రీను, పాలడుగు రాజీవ్, శ్యామ్, మూడెడ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు కవితల పోటీలు

గుడివాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని కళాశాలల విద్యార్థులకు కవితల పోటీలను నిర్వహిస్తున్నట్లు పట్టణ సాహితీ మిత్రులు సంస్థ కన్వీనర్ వసుధ బసవేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండి, కాగితంపై కవితలను రాసి వాట్సప్ నెం.94908 32787కు లేదా సాహితీ మిత్రులు, డోర్ నెం.4/96, లక్ష్మీనగర్ కాలనీ, గుడివాడ -521301కు పోస్టు ద్వారా ఈనెల 15వ తేదీ లోపు పంపాలని కోరారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

నాని బ్యాచ్‌ను ఉపేక్షించొద్దు : జనసేన



మాట్లాడుతున్న పాలంకి సారథిబాబు

గుడివాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని చేసిన అవినీతి బట్టబయలవుతున్నా కూటమి పెద్దలు ఎందుకు ఉపేక్షిస్తున్నారో అర్థం కావడం లేదని జనసేన నాయకులు పాలంకి సారథిబాబు ప్రశ్నించారు. బేతవోలులోని స్వగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొడాలి నాని బ్యాచ్ అన్నిరకాలుగా దోచుకుని కోట్లు మూటగట్టుకున్నారన్నారు. వారిని అరెస్టు చేయడానికి పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వస్తే అవినీతికి పాల్పడిన వారి అంతు తేలుస్తామని చెప్పిన మాటలను నిలబెట్టుకోవాలని కోరారు. కొడాలి నాని, దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్‌లను అరెస్టు చేసి విచారించాలని జనసేన జిల్లా నాయకులు పాలంకి డిమాండ్ చేశారు.

దేశసేవలో రామకృష్ణ మృతి చెందటం బాధాకరం



రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : సీఆర్పీఎఫ్ ఏఎస్సై రామకృష్ణ మృతి బాధాకరమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన సీఆర్పీఎఫ్ ఏఎస్సై కర్రా రామకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు పరామర్శించారు. రామకృష్ణ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు ఆకునూరి కనకాంబరం, మేరుగు మోజెస్. దళిత సంఘాల నాయకులు పొంగులేటి జయరాజు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

మండలంలోని వలివర్తిపాడు ప్రధాన రహదారి నిర్మాణ పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొక్కుమాల శ్రీకాంత్, పంచకర్ల బ్రహ్మయ్య, మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ వల్లభనేని సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



గుడివాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో విజయ్, ఐఈఆర్పీలు ఎం.కె నీలాంబరం, షేక్ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

గుడ్లవల్లేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, వ్యక్తిగత వివరాలను సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయరాదని గుడ్లవల్లేరు సబ్ ఇన్స్‌పెక్టర్ ఎన్.వి.వి.సత్యనారాయణ అన్నారు. వి.వి. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిర్మూలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ర్యాగింగ్ సమస్యలు తలెత్తితే వెంటనే కళాశాలలోని ర్యాగింగ్ వ్యతిరేకత కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. సీనియర్స్ జూనియర్స్‌తో సోదరభావంతో మెలుగుతూ, మార్గదర్శకంగా నిలవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ ప్రతినిధి వి.ఎల్ వినోద్ కుమార్, డాక్టర్ ఎస్‌కె.అమీనాబీ, డాక్టర్ పి.రవీష, వి.రజని, లావణ్య, జయశ్యామల,పి.భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

లారీడ్రైవర్ అనుమానాస్పద మృతి

గుడివాడ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్ములూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చప్పిడి చిన్న(35) శనివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు తాలుకా ఎస్.ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్న లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడని, శుక్రవారం డ్యూటీకని వెళ్లి తప్పతాగి అపస్మారక స్థితిలో ఉండగా శనివారం ఉదయం లారీ యజమాని తాలుకు వ్యక్తులు ఇంటికి తీసుకువచ్చారు. మృతుని భార్య స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ చంటిబాబు తెలిపారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



పెదపారుపూడి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. జమీదింటకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. గ్రామ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి, తహసీల్దార్ వై.రంగారావు పాల్గొన్నారు.

భూ సమస్యలకు తక్షణ పరిష్కారం



కల్వపూడి అగ్రహారంలో తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందిస్తున్న రైతులు

గుడివాడ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలపై రెవెన్యూ సిబ్బంది తక్షణం స్పందిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. కల్వపూడి అగ్రహారంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. మ్యూటేషన్, భూమి సరిహద్దు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం ముగ్గురు దరఖాస్తు చేశారన్నారు. పర్నాస, గుంటా కోడూరు, కల్వపూడి అగ్రహారాల రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమను సంప్రదించాలని కోరారు. కల్వపూడి అగ్రహారం సర్పంచ్ పొట్లూరి వెంకటేశ్వరమ్మ, ఆర్ఐ నాగబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : మేడూరులో తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి భూసంబంధిత, ఇతర సమస్యలపై ఎనిమిది అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సర్పంచ్ జి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల వికలత్వాన్ని వేలెత్తి చూపడం దారుణం

దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డా.అమ్మిరెడ్డి రజని

గుడివాడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల వికలత్వాన్ని వేలెత్తి చూపడం దారుణమని జాతీయ మానవ హక్కుల సంఘం ఛైర్మన్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అమ్మిరెడ్డి రజని అన్నారు. కొడాలి అనుచరుడు అట్లూరి నానాజీపై టీడీపీ నాయకుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఆమె విచ్చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. దివ్యాంగులు పెట్టిన కేసుపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. మజ్జాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టైరు పేలి కారు బోల్తా

● ముగ్గురికి స్వల్ప గాయాలు

గుడివాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా టైరు పేలడంతో డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. శుక్రవారం రాత్రి ఏలూరు నుంచి రేపల్లెకు వెళ్తున్న ఏపీ 39 క్యూఎఫ్ 8666 నెంబరు కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.525

తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులు హర్షణీయం : మండలి

అవనిగడ్డ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగులో పాలనకు ఇది తొలి అడుగుగా భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తెలుగుభాషకు ప్రాధాన్యత ఇస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో తెలుగు సంస్థలకు పునరుజ్జీవం కల్పించాలని బుద్ధప్రసాద్ కోరారు.



మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారి కొర్లపాటి హెప్సిబారాణి



మహిషాసురమర్దని నృత్య ప్రదర్శన



సినీ పాటలకు స్టార్ కళాశాల విద్యార్థినుల డ్యాన్స్





స్కిట్ ప్రదర్శిస్తున్న జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, ఫైమా, సునామీ సుధాకర్ డ్యాన్స్

కృషితోనే ఉన్నత స్థాయి సాధ్యం

● యువకెరటాలు ముగింపు కార్యక్రమంలో హెప్సిబారాణి, నేవీ కమాండర్ ప్రసాద్

మచిలీపట్నం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, విద్యార్థులు బాల్యం నుంచి కృషి చేస్తే ఉన్నత స్థాయికి ఎదగడం తథ్యమని ఐఏఎస్ అధికారి, కర్ణాటక ప్రభుత్వ అడిషనల్ సెక్రటరీ కొర్లపాటి హెప్సిబా రాణి అన్నారు. మచిలీపట్నం హిందూ కళాశాల ప్రాంగణంలో రెండో రోజు యువకెరటాలు కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించిన తాను అంచెలంచెలుగా ఎదగడానికి కృషి, పట్టుదల కారణమన్నారు. అప్పటికీ ఇప్పటికీ విద్యార్థులు చదువుకునేందుకు ఎన్నో అవకాశాలు వచ్చాయన్నారు. విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదిగేందుకు, ఐఏఎస్‌లు అయ్యేందుకు మచిలీపట్నం విద్యార్థులకుమార్గదర్శకత్వం వహిస్తానన్నారు. కొర్లపాటి హెప్సిబారాణి తండ్రి కొర్లపాటి విజయకుమార్‌ను మంత్రి కొల్లు రవీంద్ర సత్కరించారు.



జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

యువత దేశభక్తి కలిగి ఉండాలి

యువతీ యువకులు దేశభక్తి కలిగి ఉండాలని నేవీ కమాండర్ ప్రసాద్ అన్నారు. కమాండర్ ప్రసాద్ మంత్రి కొల్లు రవీంద్రకు, ఆర్కే విద్యా సంస్థల అధినేత బండి రామకృష్ణకు సేవా పురస్కారాలు అందజేశారు. యుద్ధనౌకల పనితీరును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, కృషి ఉంటే ఎంత ఎత్తుకైనా ఎదగగలుగుతారన్నారు. మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, మచిలీపటాని నావెల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిం దన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మచిలీపట్నంలోని విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదిగేందుకు నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభిస్తామన్నారు. సినీనటుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, యువత విద్యతో పాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మెప్మా పీడీ సాయిబాబు, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, కుంచే నాని, లంకిశెట్టి నీరజ తదితరులు పాల్గొన్నారు. కొల్లు ఫౌండేషన్ చైర్మన్ కొల్లు రవీంద్ర కళాకారులను, వక్తలను ఘనంగా సత్కరించారు.



యువకెరటాలు ముగింపు కార్యక్రమానికి హాజరైన యువత

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

యువకెరటాలు కార్యక్రమంలో రెండో రోజు ప్రదర్శించిన సాంస్కృతిక, యోగా ప్రదర్శనలు అలరించాయి. వివిధ కళాశాలల విద్యార్థులు సినీ, జానపద నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పుష్ప-2 చిత్రంలోని పాటలకు చేసిన డ్యాన్స్‌లు కరతాళ ధ్వనులందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ యోగసభ ఆధ్వర్యంలో యోగసాధకులు మద్దాల చింతయ్య, రమేష్‌లు శీర్షాసనం వేశారు. మహిళా సాధకులు సూర్యనమస్కారాలు చేశారు. జబర్దస్త్ కళాకారుడు సునామీ సుధాకర్ డ్యాన్స్, ఫైమా తదితరుల స్కిట్స్ కడుపుబ్బ నవ్వించాయి



డస్ట్‌బిన్స్ పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో బండి రామకృష్ణ, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఆరోగ్యవంత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రూ.10 లక్షల విలువైన 1250 డస్ట్‌బిన్‌లు, రూ.10 లక్షల విలువైన తోపుడుబండ్ల పంపిణీని శనివారం మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. నగర ప్రజలు పారిశుధ్య కార్మికులకు పొడి చెత్త, తడిచెత్త విడివిడిగా అందజేయాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, మరకాని సమతాకీర్తి, దింటకుర్తి సుధాకర్, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



కొల్లు హర్షిత్ సాయి, విశ్వనాథపల్లి శ్రావణిలను సత్కరిస్తున్న రిటైర్డు ఏఎస్పీ శాయన సుశీల్‌రావు, లంకిశెట్టి బాలాజీ

జాతీయ స్థాయి క్రీడాకారులకు సత్కారం

మచిలీపట్నం టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులను శనివారం ఘనంగా సత్కరించారు. లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పవర్‌లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించిన బాలసాయి డిగ్రీ కళాశాల విద్యార్థి కొల్లు హర్షిత్ సాయి, కర్రసాములో జాతీయ స్థాయిలో బహుమతులు గెలుచుకున్న లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విశ్వనాథపల్లి శ్రావణిని ఘనంగా సత్కరించారు. రిటైర్డు ఏఎస్పీ శాయన సుశీల్‌రావు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, నోబుల్ హైస్కూల్ రిటైర్డు హెచ్‌ఎం సువర్ణరాజు, జొన్నలగడ్డ వెంకటనాగరాజు తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులకు రూ. 2వేల చొప్పున నగదు బహుమతులు అందచేశారు.



సమ్మేళనంలో పాల్గొన్న భట్ల జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్ 1993-94 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెడన, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : భట్ల జ్ఞానకోటయ్య జడ్పీ హైస్కూల్‌లో 1993-94 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం స్థానిక షాదీఖానాలో జరిగింది. ఆప్యాయంగా, ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అమెరికాలో స్థిరపడిన డాక్టర్ మహ్మద్ అన్వర్ ఆలీ, పులి బాలసుబ్రహ్మణ్యాన్ని సత్కరించారు. పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

పెడన పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ గుప్తా

పెడన, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పెడన పట్టణ బీజేపీ అధ్యక్షుడుగా మామిడి లక్ష్మీనారాయణ గుప్తా రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాసవీ ప్రార్థనా మందిరంలో జరిగిన బీజేపీ సమావేశంలో లక్ష్మీనారాయణ గుప్తాను ఎన్నుకున్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా, బీజేపీ నాయకుడు కొల్లూరి రాధాకృష్ణ, పత్తిపాటి వెంకటరమణ, గొడవర్తి మంజూష తదితరులు లక్ష్మీనారాయణ గుప్తాను అభినందించారు.





డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్

విద్యావిధానంలో వినూత్న మార్పులు

● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ఎమ్మెల్యేలు మండలి, కాగిత

అవనిగడ్డ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యావిధానంలో వినూత్న మార్పులకు మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థుల విలువైన సమయం వృథా కాకూడదు అనే లక్ష్యంతో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారన్నారు. సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ప్రిన్సిపాల్ ఎన్.నరసింహారావు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు గుడిసేవ విష్ణుప్రసాద్, మత్తి శ్రీనివాసరావు, నక్కా విజయబాబు, ఎంఈవోలు ఎస్.శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చియ్య, ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం జి.ఎన్.బి.గోపాల్ , బచ్చు వెంకటనాథ్; వార్డుసభ్యురాలు పుష్పావతి, పూషడపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి : కూ టమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిచ్చి, కళాశాల విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందిస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కాళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేషలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ జ్యోతి, సర్పంచ్ సుజ్ఞానం కృష్ణవేణి, మండల టీడీపీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, యిల్లూరి లీలాకృష్ణ, అంగర రం గనాథ్, బొర్రా కాశీ, మలిశెట్టి వెంకటరమణ, దాసరి కరుణజ్యోతి, నజీర్, రేవు శ్రీనివాసరావు, ఎంఈవో-2 వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెడన : బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాల అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ కె.రామారావు ప్రారంభించారు. తొలి రోజు 100 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈవో- 2 వై.వి.హరనాథ్, జనసేన నాయకుడు కూనపరెడ్డి రంగయ్యనాయుడు, కౌన్సిలర్ ఉమ్మిటి తనూజ తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై బైక్ చోరీ కేసు

పెడన, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బైక్ అపహరించి వేరొకరికి అమ్మేసిన పత్రికా విలేకరి (ఆంధ్రజ్యోతి కాదు)పై శనివారం పెడన పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఒక దినపత్రిక విలేకరిగా పనిచేస్తున్న కొక్కు డేవిడ్‌రాజు రామలక్ష్మీ వీవర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. తన ఇంటి సమీపంలో నివసిస్తున్న భట్ట కోటేశ్వరరావుకు చెందిన మోటారు బైక్‌ను తీసుకెళ్లి కొంకేపూడికి చెందిన గోవాడ శ్రీనివాస్‌కు అమ్మేశాడు. తన బైక్ మచిలీపట్నం రైతుబజార్‌లో పార్కింగ్ చేసి ఉండటాన్ని గమనించిన కోటేశ్వరరావు దానిని తీసుకెళ్తున్న శ్రీనివాస్‌ను నిలదీయగా డేవిడ్‌రాజు అమ్మాడని చెప్పాడు. కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు డేవిడ్‌రాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే కాగిత పరామర్శ

గూడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పిండివారిపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన నాయుడు శ్రీను కుటుంబ సభ్యులను శనివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరామర్శించారు. శ్రీను కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, టీడీపీ నాయకులు సిరివెళ్ళ శ్రీను, ఎస్‌ఏ బేగ్, సిరివెళ్ళ సుబ్రహ్మణ్యం, జన్ను ప్రసాద్, పేరంరాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్టూర్పులో వరికుప్ప దగ్ధం

ఘంటసాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చిట్టూర్పు గ్రామంలో వక్కలగడ్డ గ్రామానికి చెందిన మట్టా విజయరాజు చిట్టూర్పు గ్రామ పరిధిలో ఉన్న 3.50 ఎకరాల వరికుప్ప దగ్ధమైంది. రూ.1.50 లక్షల నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు. పోలీసు, రెవెన్యూ అధికారులు విజయరాజు నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు.

కిశోర వికాసంపై అవగాహన

పెడన రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కిశోర వికాసంతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని చేవేంద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రవికుమార్ అన్నారు. పాఠశాలలో విద్యార్థుల తల్లులతో సమావేశం నిర్వహించారు. సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా, ఆత్మ రక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. రాజేశ్వరి, హైందవి, నాగమణి, బాలసరోజి పాల్గొన్నారు.



శ్రీనివాసరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న గొర్రెపాటి వెంకట రామకృష్ణ

జలధీశ్వరస్వామి సేవలో అటవీ అధికారి శ్రీనివాస రెడ్డి

ఘంటసాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వరస్వామిని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ అటవీ అధికారి ఆర్.శ్రీనివాసరెడ్డి - మల్లేశ్వరి దంపతులు శనివారం దర్శించుకున్నారు. రుత్వికులు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ జలధీశ్వర స్వామి ఆలయం విశిష్టతను వివరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. నాగాయలంక డీఆర్వో శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వండి

మండల సమావేశంలో అధికారులకు ఎంపీపీ ఆదేశం

మోపిదేవి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభ, శంకుస్థాపన కార్యక్రమాలకు ప్రొటోకాల్ నిబంధనల మేరకు సమాచారం చెప్పాల్సిందిగా ఎంపీపీ రావి దుర్గావాణి సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో శనివారం ఆయా శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. సీసీ రహదారుల ప్రారంభంలో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు. . గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల సహకారం లేకుండా ఉద్యోగులు విధులు నిర్వహించలేదర్నారు. సూర్యఘర్ నూతన పథకం ద్వారా సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు సబ్సిడీ అందిస్తున్నట్లు ఏఈ పాండురంగారావు తెలిపారు. పెదకళ్లేపల్లి, కె.కొత్తపాలెం గ్రామాల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవటంతో ఏఈ రాంబాబును నిలదీశారు. ప్రభుత్వం కేటాయించిన సిమెంట్ రోడ్లు గ్రామసర్పంచ్‌లకు తెలియకుండానే వేరే గ్రామానికి కేటాయించటంపై కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకిరాంబాబు ప్రశ్నించారు. పొరపాట్లు జరగకుండా చూస్తామని ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావులు సమాధానమిచ్చారు. వైస్ ఎంపీపీలు కడవకొల్లు సీతారామాంజనేయులు, నడకుదుటి జననీ కుమారి, ఎంపీడీవో జె.స్వర్ణ భారతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.